మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

మోమిన్‌పేట్, జూలై 15: జర్దోసి మగ్గం వర్క్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు బ్యాంకర్ల గ్రామీణ ఔత్సహికుల అభివృద్ధి సంస్థ కో ఆర్డినేటర్ సత్తయ్య పేర్కొన్నారు. మోమిన్‌పేట్‌లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఉదయం 9:30 నుంచి 4:30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వివరాలకు 9949104515 నెంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

» కలెక్టర్లు గౌతమ్, ప్రతీక్ జైన్


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

మేడ్చల్ (ఆంధ్రజ్యోతి)/వికారాబాద్, జూలై 15 : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజలు నుంచి 80 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాలు కురుస్తున్నందున వనమహోత్సవం కింద అధికారులకు వారికి నిర్ధేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రూరల్, గ్రామపంచాయతీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లా కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానాన్ని త్వరలో అమలు చేస్తున్నామనా తెలిపారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రధానంగా విద్య వైద్యం, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్ , పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, భూసర్వే తదితర అంశాలకు సంబంధించి 84 ఫిర్యాదులు వచ్చాయని, అట్టి ఫిర్యాదులను ఆయాశాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజావాణి తో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యం నిస్తూ క్షుణ్ణంగా పరిశీంచి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెకర్లు సుధీర్, లింగ్యానాయక్, ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీవో వాసు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్



విద్యార్థుల చదువులపై పర్యవేక్షణ కొరవడి పాఠశాల విద్య గాడితప్పుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు ఏ విధంగా కొనసాగుతున్నాయనేది క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా చదివే వారు చదువుతుండగా, మిగతా వారు దారి తప్పుతున్నారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల చదువులను పరిశీలించాల్సిన రెగ్యులర్ మండల విద్యాధికారులు, డిప్యూటీ ఈవోలు లేక పర్యవేక్షణ కొరవడింది. జిల్లాలో ఒకే ఒక్క రెగ్యులర్ ఎంఈవో కొనసాగుతుండగా, మిగతా వారంతా ఇన్‌చార్జి ఎంఈవోలే కావడం గమనార్హం.

పర్యవేక్షకులు లేక బోధన ప్రశ్నార్థకం?

» ఇన్‌చార్జి ఎంఈవోలతో నెట్టుకొస్తున్న వైనం
» ఎంఈవోల నియామకాలకు అడ్డంకిగా ఏకీకృత సర్వీస్ నిబంధనల అంశం
» సర్కారు దృష్టి సారిస్తేనే ప్రభుత్వ పాఠశాలలకు మనుగడ

మండలాలు మారినా....

ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పలువురు జీహెచ్‌ఎంలు మండలాలు మారినాఆ బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలు లేని మండలాల్లో అక్కడ పనిచేసే సీనియర్ జీహెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించే విధంగా చర్యలు తీసుకుంటే పాఠశాలల పర్యవేక్షణ కొంత వరకైనా కొనసాగేది. కాగా, ఈ నిర్ణయానికి నిబంధనలు అడ్డంకిగా మారాయి. 2015లో సీనియర్ జీహెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలు బాధ్యతలు అప్పగించినా ఆ తరువాత ఉద్యోగ విరమణ, బదిలీలతో ఖాళీ అయిన మండలాల్లో సీనియర్ జీహెచ్‌ఎంలకు ఎంఈవోల బాధ్యతలను అప్పగించలేదు. ఎంఈవోలుగా కొనసాగుతున్న పక్క మండలాల ఎంఈవోలకే ఖాళీ అయిన మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థుల చదువులపై పట్టింపేదీ?



వికారాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యా బోధన ఏ విధంగా కొనసాగుతోంది, విద్యార్థులు చదువులు ఎలా సాగుతున్నాయనేది పరిశీలించేందుకు మండల స్థాయిలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మండలవిద్యాధికారులు, ఉన్నత పాఠశాలలను డిప్యూటీ ఈవోలు సందర్శించాలి. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల చదువులను పరిశీలించాల్సిన రెగ్యులర్ మండల విద్యాధికారులు, డిప్యూటీ ఈవోలు లేక పర్యవేక్షణ కొరవడింది. ఏకీకృత సర్వీసు వివాదంతో రాష్ట్రంలో మండల విద్యాధికారులు, డిప్యూటీ ఈవోలు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ నియామకాలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో 2009 పదోన్నతుల అనంతరం మండల విద్యాధికారులు, డిప్యూటీ ఈవోలు నియామకం జరగలేదు. మండల విద్యాధికారులుగా కొనసాగిన వారు ఉద్యోగ విరమణ చేస్తూ రావడంతో ఆ స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టలేదు. ఎంఈవోల స్థానాల్లో మండలంలో సీనియర్ జీహెచ్‌ఎంను ఇన్‌ఛార్జి ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో ఒకే ఒక్క రెగ్యులర్ ఎంఈవో కొనసాగుతుండగా, మిగతా వారంతా ఇన్‌ఛార్జి ఎంఈవోలే కావడం గమనార్హం. సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు.

20 మండలాల్లో ఒక్కరే రెగ్యులర్ ఎంఈవో...

జిల్లాలో 20 మండలాలు ఉండగా, ప్రస్తుతం తొమ్మిది మంది మాత్రమే మండల విద్యాధికారులు ఉన్నారు. ఒక్కో ఎంఈవోకు రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ ఎంఈవో హరిశ్చంద్ర దోమ, పరిగి, పూడూరు మండలాలకు ఎంఈవోగా వ్యవహరిస్తుండగా, బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు చంద్రప్ప, బషీరాబాద్, యాలాల మండలాలకు సుధాకర్ రెడ్డి, బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాలకు రాంరెడ్డి ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వికారాబాద్, ధారూరు మండలాలకు బాబూసింగ్, దౌల్తాబాద్, పెద్దేముల్, తాండూరు మండలాలకు వెంకటయ్య, కులకచర్ల, చౌడాపూర్ మండలాలకు హబీబ్ హమ్మద్, మర్పల్లి మండలానికి విద్యాసాగర్, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్ మండలాలకు గోపాల్ ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు.

ఇన్‌చార్జి ఎంఈవోలకు పెరిగిన పనిభారం

ఇన్‌ఛార్జి ఎంఈవోలకు తమ పాఠశాల విధులతో పాటు తమకు కేటాయించిన మండలాల ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. నివేదికల తయారీ, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనం బిల్లులు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, సమావేశాలు, పాఠశాలల పర్యవేక్షణ తదితర పనులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. గత నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సందర్భంగా ఉపాధ్యాయుల సీనియార్టీ, ఖాళీల జాబితాలు తయారు చేయడంలో ఎంఈవోలు, సీనియర్ జీహెచ్‌ఎంలు కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే. పాఠశాల జీహెచ్‌ఎంగా విధి నిర్వహణతో పాటు రెండు, మూడు మండలాలకు ఎంఈవోగా బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడం వారిపై ఒత్తిడి పెంచుతోంది. పని భారం పెరగడంతో అతి ముఖ్యమైన విద్యా బోధన, విద్యార్థుల చదువుల తీరు పర్యవేక్షించే అవకాశం లేకుండా పోతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థుల చదువులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెరిగేలా విద్యా శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.



కొలిక్కి వస్తేనే...

ఏకీకృత సర్వీస్ నిబంధనల అంశం అత్యున్నత న్యాయస్థానం పరిధిలో ఉండడంతో ఎంఈవోలు, డిప్యూటీ ఈవోలు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ నియామకాలు నిలిచిపోయాయి. సీనియర్ జీహెచ్‌ఎంలకు ఎంఈవోలుగా, ఎంఈవోలకు డిప్యూటీ ఈవోలు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పదోన్నతులు కల్పించాల్సి ఉండగా ఏకీకృత సర్వీస్ నిబంధనల అంశం న్యాయస్థానంలో ఉండడం అడ్డంకిగా మారింది. పదోన్నతులు కల్పించే విషయంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పని చేసే వారి మధ్య వివాదం కొనసాగుతోంది. ఆ అంశం కొలిక్కి రాకపోవడంతో జీహెచ్‌ఎం తరువాత రావాల్సిన పదోన్నతులన్నీ నిలిచిపోయాయి. పదోన్నతుల మార్గం ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వ డైట్ కళాశాలల్లో కూడా అధ్యాపకుల పోస్టులు కూడా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఏకీకృత సర్వీస్ నిబంధనల అంశం కొలిక్కి వస్తేనే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎంఈవోల పదోన్నతులు, బదిలీలకు మార్గం ఏర్పడుతోంది. ఎంతో ముఖ్యమైన ఈ విషయాన్ని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం వల్లనే సమస్య జఠిలంగా మారి పాఠశాలలను పర్యవేక్షించే పరిస్థితి లేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పల్లె ముంగిట మీ సేవలు

» కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణులకు ప్రయోజనం
» జిల్లాలో కొత్తగా 16 మీసేవ కేంద్రాల ఏర్పాటు

మేడ్చల్ జూలై 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మేజర్ గ్రామపంచాయతీల ప్రజలు అందుబాటులో మీ సేవా కేంద్రాలు లేక ఇబ్బందులకు గురౌతున్నారు. అవసరానికి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో గల పట్టణాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ప్రభుత్వం మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో ఆయా గ్రామాల్లో కొత్తగా 16 మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. దీనితో అనేక గ్రామాలకు ప్రయోజనం కలుగనుంది. మహిళాశక్తి పథకంలో స్వయం సహాయ సంఘాల మహిళల పేరిట ప్రభుత్వం మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వ, ప్రైవేటు సేవల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ఈ కేంద్రాలను విస్తరించనున్నారు. గ్రామైక్య సంఘాల పేరిట మహిళాశక్తి మీ సేవా కేంద్రాలను మంజూరు చేసి ఇంటర్ ఉత్తీర్ణులైన సభ్యులకు ఆపరేటర్లుగా అవకాశం కల్పించనున్నారు.

16 కేంద్రాల మంజూరు

జిల్లాలో 16 మీ సేవకేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి మీ సేవ కేంద్రం ఏర్పాటుకు రూ. 2.50 లక్షల స్త్రీనిధి రుణాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేయనుంది . అందించిన రుణంతో కేంద్రాలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

గ్రామీణులకు తప్పనున్న తిప్పలు

ప్రధానంగా గ్రామైక్య సంఘం రుణాల చెల్లింపుల ప్రక్రియ సక్రమంగా ఉండటంతో పాటు ఏ గ్రేడ్‌లో ఉన్నట్లయితే ఆ సంఘానికి మీసేవ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం అందించే మార్గదర్శకాల ప్రకారం మీసేవా కేంద్రంలో పనిచేసేందుకు సంఘాల్లో అర్హత కలిగిన మహిళలను ఆపరేటర్లుగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎంపికైన మహిళలకు ప్రత్యేక శిక్షణ అందించి కేంద్రాల నిర్వహణను అప్పగించనున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసే మీ సేవ కేంద్రాల ద్వారా సమీప గ్రామాల ప్రజల తిప్పలు కూడా తీరిపోనున్నాయి.




కసరత్తు చేస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన మహిళా సంఘాలకు ప్రభుత్వం కేటాయించే మీ సేవ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టాం. దీని కోసం పలు మండలాల్లో అర్హత కలిగిన వీవోలను ఎంపిక చేశాం. కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన వసతులతో గదులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం మీసేవా కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం.

సాంబశివరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

అనంతపద్మనాభుడి చిన్న జాతరకు వేళాయె..

» నేడు ధ్వజారోహణంతో ప్రారంభంకానున్న ఉత్సవాలు



వికారాబాద్, జూలై 15 : అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆషాడ మాస చిన్న జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 16న(శుక్రవారం) ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే వేడుకలు ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి. 21న పౌర్ణమి రోజు పెరుగు బసంతంతో జాతర ముగియనుంది. ప్రతి సంవత్సరం రెండు సార్లు జరిగే ఉత్సవాల్లో చివరి రోజు పెరుగు బసంతంలో దైవ ప్రసాదం పొంది ఆ ప్రసాదాన్ని పంట పొలాల్లో చల్లుకుంటే బంగారం పండుతుందని భక్తుల నమ్మకం. కార్తీక పౌర్ణమికి రథోత్సవంతో 11రోజుల పాటు జాతరను నిర్వహిస్తారు. ఆషాఢమాసంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతారు. ఈ ఉత్సవాలకు జిల్లాకు చెందిన ప్రజలే కాకుండా హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.


కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో దిగబడిన వాహనాలు, పల్టీ కొట్టిన ట్రాక్టర్

41.4 మి.మీ.

జిల్లాలో సరాసరి వర్షపాతం నమోదు

» నవాబ్‌పేట మండలంలో 91.2 మి.మీ వర్షం
» దిగబడిన వాహనాలు, ఆర్టీసీ బస్సు » వాహనదారుల ఇబ్బందులు

వికారాబాద్(ఆంధ్రజ్యోతి)/తాండూరు/వికారాబాద్/మోమిన్‌పేట, జూలై 15: జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం వరకు కొనసాగింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. 828.2 మి.మీ.వర్షం కురియగా, సరాసరిగా 41.4మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా నవాబ్‌పేట మండలంలో 91.2మి.మీ. వర్షం కురిసింది. కోట్‌పల్లి మండలంలో 60.8మి.మీ, బంట్వారం మండలంలో 60.2మి.మీ, ధారూరు మండలంలో 59.0మి.మీ, వికారాబాద్ మండలంలో 56.4మి.మీ, పూడూరు మండలంలో47.4 మి.మీ, బషీరాబాద్ మండలంలో 47.4మి.మీ, మోమిన్‌పేట్ మండలంలో 42.4మి.మీ వర్షపాతం నమోదైంది. యాలాల్ మండలంలో 38.6మి.మీ, తాండూరు మండలంలో 38.4మి.మీ, దోమ మండలంలో 35.2మి.మీ,దుద్యాల్ మండలంలో 35.2మి.మీ, కొడంగల్ మండలంలో 34.8 మి.మీ., పెద్దేముల్ మండలంలో 34.2 మి.మీ., చౌడాపూర్ మండలంలో 30.6మి.మీ వర్షం కురియగా, పరిగి మండలంలో 28.6మి.మీ, మర్పల్లి మండలంలో 26.6మి.మీ, కులకచర్ల మండలంలో 24.6మి.మీ, దౌల్తాబాద్ మండలంలో 21.6మి.మీ, బొంరాస్‌పేట్ మండలంలో 15.0మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉంటే, జిల్లాలో పలుచోట్ల సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ ఏడాది జూలైలో సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షాలు కురిసినట్లు తాండూరువ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ చెప్పారు. ప్రస్తుతం ఏకధాటిగా కురుస్తుండడంతో పంటలకు ఎలాంటి నష్టం లేదని, కంది, పత్తి, మొక్కజొన్న, పెసర, మినుములు, పంటలకు ఎంతోమేలని తెలిపారు. కాగా వికారాబాద్ జిల్లాను ముసురు వర్షం ముంచేసింది. వికారాబాద్ పట్టణంలోని రైతు బజారు పూర్తిగా చిత్తడిగా మారి రైతులు ఇబ్బంది కరంగా మారింది. రైతు బజారు మీద ఆదాయం సమకూర్చుకుంటున్న మార్కెట్ అధికారులు అక్కడ కనీస సౌకర్యాలు సైతం కల్పించడం లేదని రైతులు, వ్యాపారులు మండిపడుతున్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మోస్తరు నుంచి నుంచి భారీ వర్షం కురవడంతో పొలాల్లో వర్షపు నీరు చేరింది. మొరంగపల్లి అండర్ రైల్వే బ్రిడ్జి కింద భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధాన రోడ్డులో మోమిన్‌పేట్ నుంచి శంకర్‌పల్లి మార్గంలో కల్వర్టుల సమీపంలో గుంతల్లో నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.


ఏపుగా పెరిగిన పత్తి చేను

కోట్‌పల్లి ప్రాజెక్టు వరద నీటిలో చిక్కుకున్న వాహనాలు

ధారూరు: హైదరాబాద్ నుంచి మూడు మహేంద్రవాహనాల్లో ఆదివారం సందర్శకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చారు. ప్రాజెక్టు అవతలివైపు నుంచి ప్రాజెక్టు లోపలికి వాహనాలను తీసుకెళ్లారు. అదే రోజు సాయంత్రం భారీ వర్షం కురియడంతో ఎగువనుంచి వరదనీరు ప్రాజెక్టులోకి రావటంతో వాహనాలు నీటిలో చిక్కుకున్నాయి. వాటిని బయటకు తీయటానికి ట్రాక్టర్‌ను తీసుకొచ్చి వాహనాలను లాగే ప్రయత్నంలో ట్రాక్టర్ ఇంజన్ పల్టీకొట్టింది. సోమవారం పోలీసులు వెళ్లి గ్రామస్తుల సాయంతో వాటిని బయటకు తీశారు.

దిగబడిన ఆర్టీసీ బస్సు

మర్పల్లి: మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామంలో బురదలో ఆర్టీసీ బస్సు దిగబడింది. గ్రామ శివారులో వంతెన నిర్మాణం కోసం సంబంధిత కాంట్రాక్టర్ వంతెన పక్క నుంచి వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక రోడ్డును వేశాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి మర్పల్లికి వస్తున్న ఆర్టీసీ బస్సు వంతెన దగ్గర బురదలో దిగబడింది. శ్రమించి అతికష్టం మీద బస్సును బురదలో నుంచి బయటకు తీయగా, మరో బస్సు సంగారెడ్డి నుంచి వస్తూ బురదలో ఇరుక్కుపోయింది. దీంతో మిగతా బస్సులను సిరిపురం నుంచి తిప్పి పంపించారు.


మట్టిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు


నాపరాతి గనిలో వరద ప్రవాహం

వరద ఉధృతికి కూలిన నాపరాతి గని.. తప్పిన ప్రమాదం

తాండూరు రూరల్ : తాండూరు మండలంలోని మల్కాపూర్‌లోని సర్వేనెంబర్-23లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి నాపరాతి గని కూలింది. గనిలో పని చేస్తున్న ముగ్గురు కార్మికులు వర్షం రావడంతో వెళ్లిపోయారు. కొద్ది సేపటికి నాపరాతి గుట్టల్లో నుంచి వాన నీటి ప్రవాహానికి గని గుట్ట కూలిపోయింది. వరద నీరు ఉధృతంగా ప్రవహించింది.దీంతో అక్కడ పని చేస్తున్న కార్మికులు భయాందోళనకు గురై పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవాబుపేట, జూలై 15: ఎల్లకొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల భరత్‌రెడ్డి తల్లి నిర్మల సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బెల్ట్‌షాపులు తొలగించాలి

● పొన్నాల్‌లో మహిళల ఆందోళన


పొన్నాల్ గ్రామంలో మద్యం బెల్ట్‌షాపులను తొలగించాలని ఆందోళన చేస్తున్న మహిళలు

శామీర్‌పేట, జూలై 15: పొన్నాల్ గ్రామంలో అక్రమార్కులు మద్యం బెల్ట్‌షాపులను విచ్చలవిడిగా నడుపుతున్నారని సోమవారం మహిళలు ఆందోళనకు దిగారు. ఆ గ్రామంలో కొందరు అక్రమార్కులు దాదాపు 11మద్యం బెల్ట్‌షాపులను దర్జాగా ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12గంటల వరకు విచ్చలవిడిగా నడుపుతున్నారని మహిళలు ఆరోపించారు. తమ గ్రామంలో ఏళ్ల తరబడి అక్రమార్కులు మద్యం బెల్ట్ షాపులను సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకున్న పాపాన పోవడం లేదని మహిళలు విచారం వ్యక్తంచేస్తున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం సేవించిన మందుబాబులు బాటిళ్లను విచ్చలవిడిగా రోడ్లపై, ఇళ్లపై వేస్తున్నారని, ఇళ్ల ముందు మూత్ర విసర్జన చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామంలోని మద్యం బెల్ట్‌షాపులను పూర్తిగా నివారించకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి


ఎదులాబాద్‌లో పర్యటించి సమస్యలను అడిగితెలుసుకుంటున్న డీఎల్‌పీవో సాంబిరెడ్డి


ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో సాంబిరెడ్డి కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం ఎదులాబాద్‌లోని దళితవాడలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగేశ్వర్‌రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యునికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: విద్యార్థులు కమ్యునికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో కమ్యునికేషన్ స్కిల్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీ ఉట్ల మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన ఉన్న భయాన్ని పోగొట్టడానికి కమ్యునికేషన్ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు మూర్తి, ఎంఎం రావు, శాస్త్రి, సంపత్, వేణుగోపాల్, హెచ్‌వోడీ విష్ణుచందన, మాధవి, నరేందర్ పాల్గొన్నారు.

పోస్టాఫీసుకు సొంత భవనం నిర్మించాలి


ఎంపీ ఈటలను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

మేడ్చల్ టౌన్, జూలై 15: మల్కాజ్‌గిరి పోస్టాఫీసుకు సొంత భవనాన్ని నిర్మించాలని కోరుతూ తపాల శాఖ యూనియన్ నాయకులు సోమవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మండలంలోని పూడూరు గ్రామ శివార్లలోని ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో తపాలా శాఖ ఉద్యోగులు కలిశారు. మల్కాజ్‌గిరి పోస్టాఫీసుకు సొంత భవనం లేని కారణంగా అద్దె చెల్లిస్తూ ప్రైవేట్ భవనాల్లో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తరుచూ అద్దె భవనాలు మారడంతో తమ విధులకు ఇబ్బందులు కలగటంతో పాటు ప్రజలకు సేవలందించలేకపోతున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తరపున తమకు సొంత భవనం సమకూర్చాలని పోస్టాఫీసు ఉద్యోగులు కోరారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సొంత భవనం కోసం స్థలం కేటాయించే విధంగా కృషిచేస్తానని ఈటల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగ సంఘం నేతలు, మల్కాజ్‌గిరి పోస్టాఫీసు ఉద్యోగులు పాల్గొన్నారు.

'డబుల్' బెడ్‌రూం ఇళ్లు
పది శాతం స్థానికులకే కేటాయించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, జూలై 15: డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో 50శాతం స్థానికులకే కేటాయించాలని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ లో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధి రాంపల్లి పరిధి రెవన్యూ సర్వే నంబర్ 258లోని 52ఎకరాలు వివిధ కుల వృత్తిదారులకు సంబంధించిన స్థలాన్ని సేకరించి, గతప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లనిర్మాణాలు చేపట్టిందన్నారు. శంకుస్థాపన సమయంలో స్థానికులకు పదిశాతం ఇళ్లను కేటాయిస్తామని, నాటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఆయన హామీని విస్మరించి ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కేటాయించారన్నారు. దీన్ని సవాలు చేస్తూ న్యాయస్థానాన్నీ ఆశ్రయించామని, కేటాయింపును రద్దు చేస్తూ స్థానికులకూ కేటాయించాలని ధర్మాసనం సూచించిందన్నారు. దీని ప్రకారం స్థానికులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

సీఎంతో ఎమ్మెల్యే భేటీ


సీఎంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 15: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాండూరు ప్రాంత అభివృద్ధి, తాండూరు కొడంగల్ అనుసంధాన రోడ్ల విషయమై చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సీఎంను కలవడం ఈ వారంలో రెండోసారి.

మేడ్చల్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్

మేడ్చల్ టౌన్, జూలై 15: గురుపౌర్ణమిని సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్ సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు డిపో అధికారులు తెలిపారు. ఈనెల 19వ తేదీన సాయంత్రం 7గంటలకు మేడ్చల్ బస్ డిపో నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రతీ ప్రయాణికుడు రూ.3900 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్యాకేజీలో భోజన వసతి కూడా ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆసక్తిగల భక్తులు అడ్వాన్స్‌గా టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు. టూర్ ప్యాకేజీకి సంబంధించి అదనపు వివరాలకు డిపో అధికారులను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.



ఆర్డీవో సాయిరాంకు వినతిప్రతం ఇస్తున్న నాయకులు

అంతారంలో మైనింగ్‌కు అనుమతివ్వొద్దు

చేవెళ్ల, జూలై 15 : మండల పరిధిలోని అంతారంలో నిర్వహిస్తున్న మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, మరోసారి దీన్ని రెన్యూవల్ చేయొద్దని కోరుతూ అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు చేవెళ్ల ఆర్డీవో సాయిరాంకు సోమవారం వినతపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేందర్ మాట్లాడుతూ.. వంద ఎకరాల్లో గుట్టను ఇప్పటికే నేలమట్టం చేశారన్నారు. ఖనిజం కోసం లోతు ఎక్కువగా తవ్వడంతో చెత్త, మురుగు నీరు నేల ఇంకి భూమి పొర కలుషితం అవుతుందన్నారు. గ్రామస్తుల క్షేమం, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు శ్రీకాంత్, రాజేశ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అక్బర్

మెదడు వాపు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించాలి

చేవెళ్ల, జూలై 15: మెదడు వాపు వ్యాధి నివారణకు 9 నెలల నుంచి 15ఏళ్ల వయసున్న పిల్లలందరికీ దశల వారీగా వ్యాక్సిన్ వేస్తామని ఆలూర్ మెడికల్ అధికారి రాఘబాబు, చేవెళ్ల ఎంఈవో అక్బర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్‌లో జేఈ వ్యాక్సిన్‌పై హెచ్‌ఎంలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మెదడు వాపు నుంచి పిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పిల్లలకు వ్యాక్సీ వేయనుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఈ నెల 25 నుంచి ఆగస్టు 15లోపు వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థికి జేఈ వ్యాక్సిన్ రెండుసార్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

'కస్తూర్బా'లో సమస్యల పరిష్కారానికి కృషి

షాద్‌నగర్ రూరల్ జులై 15: కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద కస్తూర్బా పాఠశాలను సోమవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ అరుణ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. విద్యుత్ సమస్య ఉందని, 500మంది బాలికలు ఉన్నారని, వారికి డైనింగ్ సరిపోవడం లేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఆయన మాట్లాడుతూ.. తాను సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలపై ఎమ్మెల్సీకి ప్రిన్సిపాల్ వినతిపత్రం ఇచ్చారు. వారితో ఎంఈఓ శంకర్ రాథోడ్ ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూలై 15: చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎంను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కలిశారు. ప్రజాపనుల కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

25 నుంచి పిల్లలకు జీఈ టీకా



మాట్లాడుతున్న పల్వాన్ కుమార్

వికారాబాద్, జూలై 15: 6 నుంచి 15 సంవత్సరాల పిల్లలకు జీఈ టీకాలు వేయపేపకప టేకల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ తెలిపారు. జిల్లాలోని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి సోమవారం మెదడు వాపు వ్యాధి నివారణ జీఈ టీకా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ టీకా వేయనున్నట్లు తెలిపారు. జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈనెల 25న జిల్లాలో ప్రారంభించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ మురారి, జేఈ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యత గురించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, 22 పీహెచ్‌సీల పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

వికారాబాద్, జూలై 15: 2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు కోరారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో డీఎడ్ 2007, 2009, ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు 2008, డీఎస్సీలో వెలువడిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరినట్లు గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం తప్పిదం వల్ల ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు కానీ ప్రైవేటు డీఎడ్ అభ్యర్థులకు 2008, డీఎస్సీలో అవకాశం ఇవ్వలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, కిశోర్, జగన్నాథ్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసి సమస్యను వివరిస్తున్న 2008 డీఎస్సీ అభ్యర్థులు

వైభవంగా రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ

కీసర, జూలై 15: శ్రీ రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. నిత్య సేవల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, భక్తజనసందోహం స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీసేవల్లో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈమేరకు భక్తుల కోలహలంతో, శివనామస్మరణతో సోమవారం మార్మోగింది.



కనుల పండువగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ

మహిళల గోరింటాకు సంబరాలు

షాబాద్, జూలై 15: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా మహిళలు ఆషాఢంలో గోరింటాకు సంబరాలు జరుపుకుంటున్నారు. సోమవారం మండలంలోని తాళ్లపల్లిలో సంధ్య పొదుపు సంఘం మహిళలు గోరింటాకు దిద్దుకున్నారు. రంగవల్లులతో, ఆటపాటలతో ఉల్లాసంగా గోరింటాకు పండుగను జరుపుకున్నారు. మహిళా సంఘం అధ్యక్షురాలు ఉమారాణి మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు శుభప్రదమని, ఔషధ గుణాలున్న గోరింట ఆరోగ్యానికీ మంచిదన్నారు. కార్యక్రమంలో పార్వతమ్మ, మంజుల, భావన, స్వరూప, మధున తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

» స్పీకర్ ఇంటి ఎదుట అంగన్‌వాడీల ధర్నా



స్పీకర్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వికారాబాద్, జూలై 15: తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు సోమవారం అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్ ఇంటిని ముట్టడించి నిరసన తెలిపారు. వారికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.భారతి, మనోహర లక్ష్మిలు మాట్లాడుతూ.. 45 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఆయనకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలని, జీవితంలో సగం పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు రేవంత్‌రెడ్డి సీఎం తక్షణమే అమలు చేయాలన్నారు. అసెంబ్లీ స్పీకర్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా వాసులే అయినందున కనీస వితనాల జీవో, పింఛన్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో విడుదల చేసి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నిరసన కారులను అడ్డుకున్న పోలీసులు

పరిగి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం అంగన్‌వాడీ టీచర్లు పరిగిలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడికి యత్నించారు. అంగన్‌వాడీ టీచర్లు ,హెల్పర్లు బహార్‌పేట్ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. అప్పటికే పరిగి సీఐ ఎన్.శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఎమ్మెల్యే ఇంటి గేట్‌ను మూసి తాళం వేశారు. వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.నర్సమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు నరేష్, నాయకురాళ్లు మంజుల, స్వరూప, నిర్మల, పార్వతమ్మ, పుల్లమ్మ, సంతోష, మల్లమ్మ, శ్వేత, కమల, దేవిలు పాల్గొన్నారు.



పరిగి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చిన అంగన్‌వాడీలు

కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి

తాండూరు: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నెంబర్ 10ను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప, అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్టు కార్యదర్శి భాగ్యలక్ష్మి, జయంతి, శశికళ, అరుణ, లలిత, కల్పన, సరస్వతి, సంధ్య, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ లక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 15: అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సోమవారం టీచర్ల, హెల్పర్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చి సమస్యలను చెప్పుకున్నారు. అంగన్‌వాడీలు చేసిన దీక్షలతో అప్పటి మంత్రులు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీల వేతనం 18వేలకు పెంచుతామని పేర్కొందన్నారు. వారికి రిటైర్మెంట్ బెన్ఫిట్స్, ఐదు శాతం ఐఆర్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు శ్రీను నాయక్, భేరి శ్రీనివాస్, కె.జయమ్మ, ఊర్మిళ, సంగీత, సుజాత, మమత పాల్గొన్నారు.

ఎగ్ బిర్యానీ అడిగితే.. పాచిపోయింది ఇచ్చారు

వికారాబాద్, జూలై 15: వేడివేడి ఎగ్ బిర్యానీ తినాలనుకుని హోటల్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని అనుభవం ఎదురైంది. ఆర్డర్ చేసిన ఎగ్ బిర్యానీ పాచిపోవడం చూసి కంగుతిన్నాడు. ఈ ఘటన సోమవారం వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. వికారాబాద్ బస్టాండ్ సమీపంలోని యాస్కి కాలనీకి చెందిన సంగప్ప ఎన్టీఆర్ చౌరస్తాలోని జీషాన్ హోటల్‌కు వెళ్లాడు. అక్కడ ఎగ్ బిర్యానీ పార్సిల్ ఆర్డర్‌చేసి బిల్లు కట్టాడు. హోటల్ సిబ్బంది ఇచ్చిన బిర్యానీ పార్సిల్ తీసుకొని ఇంటికి వెళ్లాడు. భోజనం చేసేందుకు సిద్ధమై పార్సిల్ విప్పగా దాంట్లో నుంచి ఒక్కసారిగా దుర్వాసన రావడంతో విస్తుపోయాడు. పాచిపోయిన వాసన ఉండటంతో ఆ పార్సిల్‌ను తిరిగి ప్యాక్‌చేసి ఆ హోటల్‌కు వెళ్లి ఇచ్చేశాడు. పాచిపోయిన బిర్యానీ ఎలా ఇస్తారంటూ ఆ హోటల్ సిబ్బందిని ప్రశ్నించాడు. అయితే ఈ విషయంలో జీషాన్ హోటల్ యాజమాన్యం వెనక్కి తగ్గకపోవడంతో సంగప్ప మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా అక్కడ ఎవరూ స్పందించలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకువెళ్లేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆయన ఫోన్ లిఫ్టు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రజారోగ్య శాఖ అధికారులు స్పందించి తనకు పాచిపోయిన ఎగ్ బిర్యానీ ఇచ్చి మోసం చేసిన జీషాన్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని సంగప్ప కోరాడు.

ఆస్పత్రిలో శిశువు మృతి

» వైద్యుల నిర్లక్ష్యమని కుటుంబీకుల ఆందోళన

తాండూరు, జూలై 15: తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పుట్టిన కాసేపటికే పసికందు మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం రేగడి మైలారం గ్రామానికి చెందిన కవిత ప్రసూతి నిమిత్తం తల్లిగారి ఊరు యాలాల మండలం దేవనూర్ గ్రామానికి వచ్చింది. ఆదివారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి మూగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు కుటుంబ సభ్యులకు చెప్పిన కొద్దిసేపటికే పసికందు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు. కాగా పసికందు పుట్టినప్పుడు బాగానే ఉన్నా, శ్వాససమస్య తలెత్తడంతోనే చనిపోయిందని ఆర్ఎంఓ అనిల్ కుమార్ తెలిపారు.

రుణమాఫీకి రేషన్ కార్డును తప్పనిసరి చేయడం దుర్మార్గం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింహారెడ్డి



రంగారెడ్డి అర్బన్, జూలై 15 : రైతుల పంట రుణమాఫీకి రేషన్ కార్డు ఉండాలని ప్రభుత్వం కండిషన్ పెట్టడం దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు శాపంగా మారిందన్నారు. అధికారమే లక్ష్యంగా అబద్ధ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలకులు రుణమాఫీ చేయకుండా రైతులను మరోసారి మోసం చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. రేషన్ కార్డుల పేరుతో రుణమాఫీకి తీవ్ర జాప్యం చేస్తారని మండి పడ్డారు. రైతులను గుర్తించేందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని గతంలో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత మార్గదర్శకాలతో రైతులను ఇబ్బంది పెట్టడం అన్యాయం అన్నారు. రెండు లక్షలకు మించి ఉన్న రుణాన్ని రైతు బ్యాంకుకు ముందుగా చెల్లించి తర్వాత అర్హతనుబట్టి 2లక్షల రుణమాఫీ వర్తింపచేస్తామని అనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఇలాంటి విధానాలను అవలంబిస్తే ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెబుతారని, షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్

వికారాబాద్, జూలై 15: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఎన్నో ఏళ్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డదిడ్డమైన రవాణా వ్యవస్థ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కిల్ చుట్టూ వెళ్లడానికి సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో అటు హైదారాబాద్ నుంచి వచ్చే వాహనాలు, ఇటు తాండూరు నుంచి వచ్చే వాహనాలు, వికారాబాద్ లోపలి నుంచి వచ్చే వాహనాలు అన్నీ ఒకే రోడ్డుకు చేరుకుంటాయి. రోజురోజుకు సమస్య తీవ్రమవుతున్నా అధికారులు, పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ పట్టణంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచే వారే లేరా? అని వాపోతున్నారు. ఇప్పటికైనా రద్దీ దృష్ట్యా చౌరస్తాలో వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలి



జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, జూలై 15: పంట పొలాల నుంచి వేస్తున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి రైతులతో కలిసి వినతిప్రతం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్మిస్తున్న బీదర్-మహేశ్వరం 765కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్, టవర్లను చేవెళ్ల, షాబాద్, కేశంపేట్, కొందుర్గు, ఫారూఖ్‌నగర్, కడ్తాల్, కందుకూర్ మండలాల మీదుగా వేస్తున్నారన్నారు. 165కిలో మీటర్ల మేర వేస్తున్న లైన్ కోసం రైతులు 3వేల ఎకరాలు కోల్పోతున్నారని చెప్పారు. భూముల విలువ ప్రస్తుతం ఎకరానికి కోటి నుంచి మూడు కోట్లు ఉందన్నారు. 2013 భూసేకరణ చట్టం ద్వారా బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర చెల్లించాలని కోరారు. పవర్ గ్రిడ్‌కార్పొరేషన్ అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం నిర్వాసి రైతులకు భూసేకరణ చట్టం, ఎలక్ట్రిసిటీ యాక్ట్‌ల ప్రకారం పరిహారం ఇవ్వాలని అధికారులకు సూచించారని గుర్తు చేశారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, జూలై 15: కడ్తాలలో ఈ నెల 17న తలపెట్టిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరిశీలించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. భవనాన్ని పరిశీలించి పనుల నిర్వహణకు కమిటీలకు బాధ్యతలు అప్పగించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఎంఈవో సర్దార్ నాయక్, ఎంఎన్‌వో జంగయ్య, ఎస్‌వో అనితలకు సూచించారు. అనంతరం ఎంబీఏ గార్డెన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కేజీబీవీ భవన నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు కొందరు బీఆర్ఎస్ నాయకులు భవన ప్రారంభంపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. మంత్రితో కార్యక్రమం నిర్వహిస్తే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం ఆశ్చర్యం వేస్తోందని, వారు నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోం అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్/మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, బీచ్యనాయక్, నాయకులు రాములు, డాక్టర్ శ్రీనివాస్, బిక్యనాయక్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబ, యాదగిరిరెడ్డి, చందోజీ, హీరాసింగ్, శంకర్, నరేందర్, అశోక్, లక్ష్మణ్, కృష్ణ, శేఖర్‌గౌడ్, జహంగీర్‌అలీ, అశోక్, తిరుపతిరెడ్డి, ప్రభు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మల్లు రవిని సన్మానిస్తున్న మండ్లీ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య

ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర

ఆమనగల్లు, జూలై 15: ప్రజావిశ్వాసాన్ని కోల్పోయి పతనమవుతున్న బీఆర్ఎస్ ఉనికి కోసం నిరుద్యోగులు, విద్యార్థులను రెచ్చగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు కుట్ర చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకొని దివాలా తీయించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ప్రేరేపిత ఉద్యమాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న ఎంపీ రవిని సోమవారం ఆమనగల్లులో కాంగ్రెస్ నాయకులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, గండికోట మల్లేశ్‌లు సత్కరించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఎంపీ మాట్లాడుతూ పదేండ్లు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఓర్వలేక కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారన్నారు. ఏటా 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన విధంగానే తాము ఇప్పటికే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. త్వరలోనే డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇది కాగేనే మరోసారి కూడా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొప్పు రాఘవేందర్, ఇమ్రాన్‌బాబ, యాదయ్య, మానయ్య ఉన్నారు.

ఏ ప్రయోజనం కోసం కాంగ్రెస్‌లో చేరారు?

» బీఆర్ఎస్ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి

శంషాబాద్, జూలై 15: ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచి ఇప్పుడు ఏ ప్రయోజనం ఆశించి కాంగ్రెస్‌లో చేరారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ప్రశ్నిస్తున్నారని, వారికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శంషాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నమ్మకంతో టికెట్ ఇచ్చి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయనకు ద్రోహం చేసి కాంగ్రెస్‌లో ఎలా కలుస్తారన్నారు. ఎంత మంది నాయకులు పార్టీ మారినా బీఆర్ఎస్‌కు ప్రజల అండదండలున్నాయన్నారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులకు రాష్ట్రంలో పుట్టగతులుండవని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కబ్జాచేసేందుకే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఆయన అనుచరులు కాంగ్రెస్‌లో చేరారని ప్రజలంతా చర్చించుకుంటున్నారని కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. ఒక్క గజం ప్రభుత్వ భూమి కూడా కబ్జా చేయనివ్వం అని, తాను ముందుండి పోరాడుతానన్నారు. భవిష్యత్తులో ప్రజల ఆశీస్సులతో కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు పునర్వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థినుల ఎంపిక

షాబాద్, జూలై 15 : ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినులు కేంద్ర విద్యా శాఖ ఇచ్చే స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాచ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర విద్యా శాఖ ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు ఇచ్చే రూ.70వేలు ఉపకార వేతనానికి ఎస్.సృజనహంసిక, ఎం.సంజన, పి.సిరి, కె.గీతాంజలి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి డిగ్రీలో యేటా రూ.10వేల చొప్పున 30వేలు, అలాగే పీజీలో రూ.20వేల చొప్పున రూ.40వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

● సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికారాబాద్ మాజీ జడ్పీటీసీ మహిపాల్ రెడ్డి, హన్మంత్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.
- వికారాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి)

పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన



బోనాలతో ఊరేగింపుగా బయల్దేరిన మహిళలు

తాండూరు రూరల్, జూలై 15: ఐనెల్లిలో పోచమ్మతల్లి పునః ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. సోమవారం అమ్మవారి పునః ప్రతిష్ఠాపన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజేందర్‌రెడ్డి, ఎం.వెంకటేష్, శివకుమార్, జి.కృష్ణ, ఎం.నర్సింహులు, మొగులయ్య, అనంతరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా: ఎమ్మెల్యే

పోచమ్మతల్లి విగ్రహం పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్, మాజీ సర్పంచ్ లలిత పాల్గొన్నారు.

ప్రజలు చట్టాలను గౌరవించాలి

శామీర్‌పేట/మూడుచింతలపల్లి, జూలై 15: ప్రజలు చట్టాలను గౌరవించాలని వారి చేతుల్లోనే వున్నవన్న పీఎస్ రాములు పిలుపునిచ్చారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాలపై ప్రజలకు, వివిధ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హరిక, అనిత, పరుశరాం, మునిందర్, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బషీరాబాద్, జూలై 15: మండల వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ సూచించారు. కాగ్నానది పరివాహక ప్రాంతాలైన జీవన్గి, క్యాద్గీరా, నవాంద్గి, ఇందర్‌చెడ్ గ్రామాల పరిధిలో నది నీటి ప్రవాహంలోకి ప్రజలు వెళ్లవద్దన్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఎప్పుడైనా నది ఉప్పొంగి ప్రవహించే అవకాశం ఉంటుందన్నారు. పాతబడిన ఇళ్లలో ఎవరైనా ఉన్నట్లయితే వేరొకచోట నివాసముండాలన్నారు. అత్యవసర సాయం కోసం గ్రామస్థాయి అధికారుల దృష్టికి తీసుకువస్తే తమ వంతుగా సహకరిస్తారన్నారు.

మర్పల్లి: రెండు రోజుల పాటు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్పల్లి తహసీల్దార్ గణేశ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ముందు గా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 5 ఫిర్యాదులు అధికారులకు అందించారు. అనంతరం తహసీల్దార్ గణేశ్ విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల పాటు భారీ వర్షాల నేపథ్యంలో రోడ్డు మార్గం, వాగుల దగ్గర ప్రమాదం పొంచి ఉంటుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజమల్లయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



కీసర రూరల్: ముంపు సమస్యపై అధికారులతో స్థానికుడి వాగ్వాదం

కీసర రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ అన్నారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. అందులో ప్రధానంగా వరద ముంపునకు గురవుతున్న సాయిరత్న కాలనీ వాసి ముంపు సమస్యను పరిష్కరించాలని అధికారులతో వాగ్వాదానికి దిగాడు. సంవత్సరాల తరబడి వరద ముంపు బారిన పడుతున్నామని వాపోయారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సుదర్శన్ రఘు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బాలమల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కొడంగల్ రూరల్, జూలై 15: టేకుల్‌కోడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఉద్యోగోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయులు రాములు, గోవిందు, కరుణాకర్, చంద్రకాంత్, నాగప్ప, విజయలక్ష్మిలతో పాటు ఉద్యోగోన్నతిపై వెళ్తున్న వచ్చిన అనురాధ, నర్సింహ, జగన్‌లను గ్రామస్తులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నింగారెడ్డి, బస్వరాజ్, గోవర్ధన్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, డంకూర్ పాండు, రాజు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయురాలు పూర్ణిమ బదిలీ కావడంతో ఆమెను గ్రామస్తులు సన్మానించారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గ్రామ యువకులు ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ధారూరు: కాచారం పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను అనురాధను సోమవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, హెచ్ఎం శివాని, పాఠశాల చైర్మన్ సమీనాబేగం, ఉపాధ్యాయులు గౌరి నాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నాపరాతి గనులపై ఫిర్యాదు

తాండూరు రూరల్, జూలై 15: మండల పరిధిలోని సర్వేనంబర్-62 బీ లో 3ఎకరాల 18గుంటల భూమిలో నాపరాతి గనులు ఉన్నాయి. ఈ గనుల్లో రెవెన్యూ, మైనింగ్, విద్యుత్ శాఖల అనుమతులు లేకుండానే గనుల నడుస్తున్నాయని కరన్‌కోట్‌కు చెందిన యు.రామప్ప తాండూరు తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా అనుమతులు లేని గనులకు విద్యుత్ ఇస్తున్న ఆ శాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గనుల తవ్వకంనేందుకు మైన్స్, విద్యుత్ శాఖ అధికారులు ఎలా అనుమతిస్తారని ఫిర్యాదులో ప్రశ్నించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నిరుద్యోగులపై దాడులు సహించం



తాండూరు: అరెస్టయిన బీఆర్ఎస్వీ, బీజేపీ నేతలు

తాండూరు, జూలై 15: కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఆందోళనలు చేస్తున్న నిరుద్యోగులపై దాడులు చేయడం సహించబోమని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు చేపట్టిన సెక్రటేరియట్ ముట్టడికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని అన్నారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో 34లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నెలనెలా ఉద్యోగాలు కల్పిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి విస్మరించారని దుయ్యబట్టారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నిరుద్యోగుల సమస్యలపై అఖిల పక్షం ఆధ్వర్యంలో సోమవారం సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా తాండూరు పోలీసులు బీజేవైఎం, బీఆర్ఎస్వీ నాయకులు తాండ్రా నరేష్, దత్తాత్రేయ, శివ తదితరులను ముందస్తు అరెస్టు చేశారు.

పూడూరు: డీఎస్సీ వాయిదా వేయాలని కోరుతూ సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా తరలివెళుతున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. డీఎస్సీ బాధితులకు అండగా సోమవారం చేపట్టిన ముట్టడి కార్యక్రమానికి పూడూరు మండలంలోని కంకల్ గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కంకల్, చెన్‌గోముల్ గ్రామానికి చెందిన జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యయ్యల రాజులు తరలివెళుతున్నారు. వీరిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దౌల్తాబాద్: నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న తమను పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సరైంది కాదని మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ అన్నారు. నిరుద్యోగుల తరఫున ధర్నా నిర్వహిస్తారని సమాచారం వచ్చిందని పోలీసులు సోమవారం తెల్లవారుజామున అరెస్టు చేసి దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బషీరాబాద్: నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన సెక్రటేరియట్ ముట్టడిని పోలీసులు అడ్డుకొని నిర్బంధించడం తగదని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకుడు ఈడ్గి సంజయ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బషీరాబాద్ మండలం మల్కన్‌గిరిలో విద్యార్థి నాయకుడు బాలకృష్ణను స్థానిక పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయమై ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరామ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

నూతన పాలక వర్గం ఎన్నిక

కీసర రూరల్, జూలై 15: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ గ్రామ దేవతల ఆలయాలకు సోమవారం నూతనంగా పాలకవర్గాలను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీసాల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా పోదువల్ల శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా మీసాల సురేష్, కోశాధికారిగా నల్లోల బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మీసాల భాస్కర్, ఎంకిరాల స్వామి, పోదువల్ల ఈశ్వర్, మంచాల నర్సింగ్‌రావు, పోదువల్ల రవి, సీనియర్ సలహాదారులుగా మంచాల కృష్ణ, మంచాల శ్రీనివాస్, బండెల వెంకటేష్, మంచాల మహేందర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా పాలకవర్గ సభ్యులను స్థానికులు శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీల నిర్వహణలో రాజీపడొద్దు

మేడ్చల్ టౌన్, జూలై 15: అంగన్‌వాడీల నిర్వహణలో రాజీ పడకుండా పిల్లల ఆలనాపాలన చేపట్టాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. అమ్మ మాట-అంగన్ వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించారు. ఈ నెల 20వరకు కొనసాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టి అత్యధిక సంఖ్యలో పిల్లలు అంగన్ వాడీలో చేరేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సుహాసిని, ఏసీడీపీవో స్వర్ణలత, డీఈ విజయలక్ష్మి, టీచర్ విజయ పాల్గొన్నారు.

శామీర్‌పేట: మూడేళ్ల పిల్లలను విధిగా ప్రభుత్వ అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఎంపీడీవో మమతాబాయి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం శామీర్‌పేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా చేపట్టిన అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వన్య, టీచర్లు నిర్మల, రమాదేవి, శకుంతల, పద్మ, భవాని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి మానిక, ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ ఇద్రి జ్యోతి, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించారు.

డీజీపీని కలిసిన బీజేపీ రాష్ట్ర నాయకుడు

కొడంగల్, జూలై 15: తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌ను కొడంగల్ పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు పూనంచంద్‌లాహోటీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో మహబూబ్‌నగర్ ఎస్పీగా విధులు నిర్వహించిన డీజీపీని సోమవారం హైదరాబాద్‌లో కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అండర్‌పాస్ నిర్మించాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి అంకుషాపూర్ వద్ద అండర్‌పాస్ నిర్మించాలని సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు వినతిపత్రం అందజేశారు. నగరంలోని ఈటల రాజేందర్ నివాసంలో కలిసి జాతీయ రహదారి దాటి అంకుషాపూర్ గ్రామానికి వెళ్లాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు బద్దం నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ముందు రేకులు, మెట్ల కూల్చివేత

ఘట్‌కేసర్, జూలై 15: ఘట్‌కేసర్‌లోని పాత జాతీయ రహదారికిరువైపుల దుకాణాల ముందున్న రేకులు, మెట్లు, ఫుట్‌పాత్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ కూల్చివేయించారు. కొండాపూర్ రైల్వేగేట్‌పై నిర్మిస్తున్న వంతెన పనులు నిలిచిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనాల రాకపోకల కోసం వంతెన నిర్మాణ సామగ్రి అడ్డుగా ఉండటంతో రోడ్డు ముందు దుకాణదారులు వేసుకున్న రేకులను, ఫుట్‌పాత్‌తో పాటు మెట్లను కూల్చివేశారు. ఈవిషయమై దుకాణదారులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా తమ నిర్మాణాలను కూల్చివేయడం ఎంటని ప్రశ్నించారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** మొహర్రం ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంతో వివిధ గ్రామాల్లో చావిడిల్లో పీర్ల ప్రతిష్ఠాపనతో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో సోమవారం 5 రోజుల పాటు ప్రార్థనలు నిర్వహించి పీర్లను ఊరేగించి నిమజ్జనం చేశారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన అజయ్‌యాదవ్‌ను సోమవారం అవుశాపూర్ కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు కావాడి వామన్‌రెడ్డి, మాదవరెడ్డి, ముద్దం మల్లేష్ యాదవ్, కృష్ణ, సాయిగౌడ్, ఎన్. సందీప్‌రెడ్డి తదితరులు అజయ్‌యాదవ్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

● **తాండూరు రూరల్:** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న తాండూరు పట్టణంలోని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత ప్రజా సంఘాల నాయకులు ఎంఈవో వెంకటయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గప్ప, గుమ్మడి రత్నం, బాలరాము ఉన్నారు.

● **మోమిన్‌పేట్:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన ప్రీతం ను హైదరాబాద్‌లో మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లాదేవేందర్ రావు అధ్యక్షుడు కొనింటి సురేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట రవి, సామెల్, కిషోర్ ఉన్నారు.

● **తాండూరు రూరల్:** మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

● **బషీరాబాద్:** మంతట్టిలో తాగునీటి సమస్యను అధికారులు సోమవారం చెక్‌పెట్టారు. కార్యదర్శి శ్రీనాథ్ గ్రామ ప్రత్యేకాధికారి వెంకయ్య దృష్టికి తీసుకెళ్లాడు. ఎంపీడీవో రామప్రుల, ఎంపీవో రమేష్ ఆదేశానుసారం బోరును మరమ్మత్తు చేయించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** టీ20 భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్‌ను సోమవారం ఎదులాబాద్ వేణుగోపాలస్వామి దేవాలయ ధర్మకర్త అంబారీపేట వరదరాజులు శాలువాతో సత్కరించారు.

● **యాలాల:** ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామని యాలాల మాజీ ఎంపీపీ బాల్‌శ్వర్ గుప్తా అన్నారు. తుప్పర్లగడ్డ తండాలో సోమవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో తండాకు తాగునీటి బోరు మోటార్‌ను ప్రారంభించారు.

● **కొడంగల్ రూరల్:** యువత స్వయం ఉపాధిని ఎంచుకోవడం హర్షణీయమని రావుల్‌పల్లి మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్ పట్టణంలో నవాజ్‌కు చెందిన నూతన బిరియానీ సెంటర్‌ను మైనారిటీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయనను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎస్.ఎం.గౌసన్, కరీం, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మండల కేంద్రంలో రూ.కోటి 50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కొడంగల్ ప్రాంతం రావులపల్లి గ్రామానికి చెందిన డాక్టర్. రాములు తన వంతుగా రూ.25వేల నగదు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సాయిలెగొడ్‌కు సోమవారం అందజేశారు.

● **వికారాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిల్లాపటి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తుందని పేర్కొన్నారు.

● **కులకచర్ల:** కులకచర్ల తహసీల్దార్ కార్యాలయంలో కుర్మేలను సాల్విడ్ గ్రామ దళిత యువజన సంఘం ఆధ్వర్యంలో 16 కుర్చీలను సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజయ్యగౌడ్ ఉన్నారు.

● **కులకచర్ల:** సాల్విడ్ గ్రామంలో బోయ నర్సప్ప (65) సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన. ఆమె సొసైటీలో నల్కత్తం పొందారు విషయం తెలుసుకున్న జిల్లా సహకార బ్యాంకు సీఈవో బక్కారెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య స్పందించి మృతురాలి అంత్యక్రియల కోసం సొసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్ ద్వారా రూ.5వేలు అందించారు.

● **కులకచర్ల:** వీరాపూర్ లింగాయత్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణ పనులకు మాజీ సర్పంచ్ జానకిరామ్ తన వంతుగా రూ.11వేలు ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు చంద్రప్రకాశ్, వినోద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు అదృశ్యం



ఈశ్వర్

మూడుచింతలపల్లి, జూలై 15: మండల పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశవపూర్ గ్రామానికి చెందిన బుడిగె ఈశ్వర్(30 సంవత్సరాలు) కీసరలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈ నెల 10వతేదీన కేశవపూర్ నుంచి రోజూ లాగే కీసరలో పనినిమిత్తం వెళ్లి తిరిగి సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాల బంధువుల వద్ద వెతికి చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో వారి కుటుంబసభ్యులు శామీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా మండలంలోని కేశవరం తండాకు చెందిన కేతావత్ గణేష్(24 సంవత్సరాలు) ఈనెల 8వ తేదీన ఉదయం 9గంటలకు కటింగ్ షాపునకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు శామీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కేతావత్ గణేష్

హోంగార్డుపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: ఎస్సీ ఎస్టీ కేసు పెడుతానని పోలీసులను బెదిరించిన ఓ హోంగార్డుపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌కు చెందిన ఆజ్మీర కిషన్ హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డ్ విధులు నిర్వహిస్తున్నాడు. కాగా అతడి కుమారుడు ఆజ్మీర వెంకటేష్ ఈనెల 12న ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నిర్వహించిన కురగాయల సంతలో ధనలక్ష్మి అనే వ్యక్తి మెడలో నుంచి బంగారం, వెండి గొలుసులు లాక్కెళ్లాడు. దీంతో ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదుచేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడు ఆజ్మీర వెంకటేష్‌ను ఈనెల 13న సాయంత్రం అరెస్టు చేశారు. విచారణ చేపట్టి రిమాండ్‌కు తరలిస్తుండగా వెంకటేష్ తండ్రి ఆజ్మీర కిషన్ తన కొడుకును అరెస్టు చేసి ఎలా రిమాండ్ చేస్తారని పోలీసు సిబ్బందిని దూషించాడు. సిబ్బంది ఎంతచెప్పినా వినకుండా కిషన్ వినకుండా లోపలికి వెళ్లి క్రైం సీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించాడు. తన కొడుకు రిమాండ్‌కు తరలిస్తే మీ అంతు చూస్తా, మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి సస్పెండ్ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, బెదిరింపులకు పాల్పడిన హోంగార్డు కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● కారుడ్రైవర్‌పై హిట్ అండ్ రన్ కేసు



గిరిబాబు(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, రాజీవ్‌గృహకల్పకు చెందిన క్యాబ్ డ్రైవర్ బొడ్డు గిరిబాబు(42) ఆదివారం సాయంత్రం ఫోన్ మాట్లాడుతూ వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి ఎన్ఎఫ్‌సీ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గిరిబాబు పది అడుగుల దూరంలో ఎగిరిపడటంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతుండగా సోమవారం ఉదయం గిరిబాబు మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా కారు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారుడ్రైవర్‌పై హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బోర్‌వెల్ వాహనం సీజ్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేస్తున్న బోర్‌వెల్ వాహనాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి సీజ్‌చేసి ఆధీనంలోకి తీసుకున్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరామ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, చందుపట్లగూడ సమీపంలోని గ్రీన్‌వ్యాలీ వెంచర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా 20 బోర్లు వేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రజని ఆదేశాల మేరకు ఆర్ఐ సాయిరామ్, సిబ్బందితో వెళ్లి బోర్‌వెల్‌ను నిలిపివేశారు. బోర్‌బండి నిర్వాహకులు అక్కడికి వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దుర్భాషలాడారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్న బోర్‌వెల్ వాహనంతో పాటు కంప్రెషర్ వాహనాన్ని సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బోర్లు వేస్తే చర్యలు తప్పవని ఆర్ఐ సాయిరామ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న పాన్‌షాప్‌పై దాడి

● ఈ-సిగరెట్లు, విదేశీ సిగరెట్లు 49 బాక్సులు స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 15: అనుమతులు లేని ఈ-సిగరెట్ (ఎలక్ట్రానిక్ సిగరెట్)తో పాటు విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న పాన్‌షాప్‌పై ఘట్‌కేసర్ పోలీసులు దాడి చేసి పాన్‌షాప్ నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన షేక్ ఖైజర్(26) అదే కాలనీలో జగదాంబ థియేటర్ సమీపంలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పాన్‌షాప్‌పై దాడిచేసి విదేశాలకు చెందిన వికింగ్ సైజ్ 14 బాక్సులు, ఏ-10 సిగరెట్ 18 బాక్సులు, మౌండ్ గ్రీన్‌ఆపిల్ సిగరెట్ 9 బాక్సులు, మౌండ్ వాటర్‌మిలాన్ సిగరెట్ 5 బాక్సులు, మౌండ్ గ్రేప్ సిగరెట్ 3 బాక్సులు, మొత్తం 49బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. షేక్ ఖైజర్‌ను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లబ్ హౌస్‌లో డ్రగ్స్ వినియోగం.. హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేపీహెచ్‌బీ 13ఫేజ్‌లోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లాస్ క్లబ్ హౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలు, చట్టవిరుద్ధమైన డ్రగ్స్, లిక్కర్, గ్యాంబ్లింగ్‌కు వేదికగా మారిందని.. దీనిపై ఫిర్యాదు చేసినా యాజమాన్యం, పోలీసులు సరైన చర్యలు తీసుకోవడంలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సదరు అసోసియేషన్‌లో ఓ విల్లా యజమాని హరిగోవింద్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈపిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం జనరల్ బాడీ సమావేశం నాలుగు వారాల్లో నిర్వహించి డ్రగ్స్ వినియోగం సహా ఇతర అక్రమాలు జరగకుండా శాశ్వత నివారణచర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

ఘట్‌కేసర్, జూలై 15: ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ ఎండీ సాబేర్‌అలీ అన్నారు. ఘట్‌కేసర్‌లోని బ్రూక్‌బాండ్ కాలనీలోని పార్కులో సోమవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలను పంపిణీ చేశారు.

కులకచర్ల: చెట్లను పెంచి పోషిస్తే అవి మనల్ని కాపాడుతాయని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీవో కరీం, కార్యదర్శి సంజీవ్‌కుమార్, టీపీ నరేశ్, ఏపీఎం వెంకయ్య, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఇంటికో మొక్కను నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ పిలుపునిచ్చారు. తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ వెంకట్‌గోపాల్ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఖాళీ ఆవరణలో ఆరు మొక్కలను తప్పని సరిగా నాటి సంరక్షించేలా చర్యలను తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాధుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ భాస్కర్, వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

షాదీఖానాను పట్టించుకోరా?

కొడంగల్, జూలై 15: తాండూర్ రోడ్డులో గల షాదీఖానా (ఉర్దూ ఘర్) శిథిలావస్థకు చేరినా పట్టించుకోవడం లేదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.నేజీర్‌గుల్షన్ అన్నారు. సోమవారం షాదీఖానా ముందు రోడ్డుపై పార్టీ కార్యకర్తలు, నాయకులు, మైనారిటీ సోదరులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సర్తాజ్ హుస్సేన్, షేక్ రహమాన్, ఎండీ.ముర్తుజా, సయ్యద్ ముస్తఫా, ఎండీ.అజహర్ తదితరులు పాల్గొన్నారు.